క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో రాత్రికి రాత్రి వెలిసిన పచ్చబడ్డీ కొట్లను మంగళవారం టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయంటూ ఇటీవల మధురానగర్ బీఆర్‌టీఎస్ రోడ్డులో ఎనిమిది సంవత్సరాలుగా ఉన్న బడ్డీ కొట్లను అధికారులు తొలగించారు. అయితే సోమవారం రాత్రికి రాత్రి పచ్చ బడ్డీలు ఏర్పాటు చేశారు. దీంతో అధికారులను వివరణ కోరగా నూతనంగా ఏర్పాటు చేసిన బడ్డీ కొట్లను తొలగించారు. ఇక్కడ ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

దోమల నివారణ మందు పిచికారీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): దోమల నియంత్రణ చర్యల్లో భాగంగా 29, 30వ డివిజన్‌లో మంగళవారం ఫాగింగ్ నిర్వహించారు. మధురానగర్, నేతాజీ కాలనీ, గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో ఆటోల ద్వారా ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా మలేరియా విభాగం సిబ్బంది దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీ దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

అన్న క్యాంటీన్లలో మెరుగైన సేవలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్న క్యాంటీన్లలో నాణ్యమైన మెరుగైన సేవలు అందించాలని 32వ డివిజన్ కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహనరావు సూచించారు. స్థానిక అయోధ్యనగర్ అన్న క్యాంటీన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లేట్లు, ఫ్లోరింగ్‌ను శుభ్రంగా ఉంచాలని సూచించారు. క్యాంటీన్‌కు వచ్చే ప్రతిఒక్కరికీ పరిశుభ్ర వాతావరణంలో సేవలు అందించాలన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో వ్యాన్ డ్రైవర్ గాయపడిన ఘటన సోమవారం రాత్రి గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గుణదల పోలీసుల కథనం మేరకు బుడమేరు మధ్యకట్ట లెనిన్‌నగర్‌కు చెందిన పుర్లి రవి వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈయన 19వతేదీ రాత్రి 10 గంటలకు తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా భానూనగర్ బస్టాప్ వద్ద వేగంగా వచ్చిన స్కూటీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన రవిని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెలగని వీధి దీపాలతో ఇక్కట్లు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో వీధి దీపాలు సక్రమంగా వెలగటం లేదు. దీంతో వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. చీకటిలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. దంతులూరు వారి వీధి, అప్పలరాజు వీధి, వెంకటేశ్వర స్వామి వీధి, పింగళి వారి వీధిలోని వీధి దీపాలు సక్రమంగా వెలగటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇటొస్తే జర జాగ్రత్త!



మారుతీనగర్‌లో కుంగిన ఇనుప కల్వర్టు



విశాలాంధ్ర రోడ్డు, ఇజ్జాడ వారి వీధి మలుపులో డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత వద్ద ఇలా..

ఏలూరు రోడ్డు, విశాలాంధ్ర రోడ్లలో మ్యాన్‌హోల్స్ మూతలు ధ్వంసం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): యూజీడీ మ్యాన్‌హోల్స్ మూతలు పగిలి వాటి వద్ద గోతులు పడటంతో ప్రధాన రహదారులపై వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వాటి వద్ద జర జాగ్రత్తగా ఉండాల్సిందే. లేకపోతే ప్రమాదాల బారిన పడటమే. నగరంలో ఏలూరు రోడ్డు, విశాలాంధ్ర రోడ్లలో ఈ సమస్యలు ఏర్పడ్డాయి. అయినా కార్పొరేషన్ సిబ్బంది స్పందించకపోవడంతో వాహనచోదకులు, పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- చుట్టుగుంట ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైంది. స్థానిక వ్యాపారులు ఈ మ్యాన్‌హోల్ మూత స్థానంలో చుట్టూ నాపరాళ్లు ఉంచారు. అవి కూడా ధ్వంసం కావడంతో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఉండే బారికేడ్‌ను తెచ్చి అడ్డుగా ఉంచారు. నిత్యం ఇటుగా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాన కురిస్తే రహదారిపై నీరు నిల్వ ఉంటుంది. కొత్త వారు ఎవరైనా ఇటుగా వచ్చినప్పుడు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరగడం ఖాయం.



చుట్టుగుంట ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద కుంగిన ఇనుప కల్వర్టు

- విశాలాంధ్ర రోడ్డులో నుంచి ఇజ్జాడ వారి వీధిలోకి వెళ్లే మలుపులో ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ ధ్వంసమైంది. రహదారి మలుపులో పెద్ద గొయ్యి మాదిరిగా ఏర్పడింది. దీనికి అతి సమీపంలోనే ప్రయివేటు పాఠశాల, దుకాణాలు ఉన్నాయి. విద్యార్థులు అటు ఇటు వెళ్తుండటం, రహదారి మలుపులో ఉండటంతో అక్కడి దుకాణాల వారు పగిలిన చెక్క కుర్చీలు, బల్లలు తెచ్చి ప్రమాదకరంగా ఉన్న చోట పెట్టారు. రాత్రి వేళ ఈ చెక్కలు కనిపించకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు ఉపయోగించే బారికేడ్‌ను అడ్డుగా పెట్టారు.
- మారుతీనగర్ నుంచి ఏలూరు రోడ్డులోకి వచ్చే మలుపులో ఉన్న కల్వర్టు మధ్యలో.. ఏర్పాటు చేసిన ఇనుప మెష్ (కల్వర్టు) మధ్యలో కుంగిపోయింది. రహదారి మధ్యలో ఇలా ఉండటంతో వాహనచోదకులు ఇటుగా రాకపోకలు సాగించడానికి సర్కస్‌ఫీట్లు చేయాల్సిన పరిస్థితి ఉంది
- కార్పొరేషన్ సిబ్బంది తక్షణమే స్పందించి ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిందిగా వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

నగరంలో 'ఆయ్' సందడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో ఆయ్ చిత్ర బృందం మంగళవారం సందడి చేసింది. పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని ఎస్ఎస్ ఇడ్లీ హోటల్లో టిఫిన్ చేసి, అక్కడకు వచ్చిన వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ చిత్ర హీరో నార్నే నితిన్ మాట్లాడుతూ ఆయ్ చిత్రం విడుదలైన అన్ని చోట్ల పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో సక్సెస్ టూర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో థియేటర్స్‌లో ప్రేక్షకులను కలిసి కృతజ్ఞతలు చెబుతున్నామని, ప్రతిచోటా బ్రహ్మరథం పడుతున్నట్లు చెప్పారు. హీరోయిన్ నయన్ సారిక మాట్లాడుతూ ఆయ్ చిత్రం విజయవంతం కావడంతో సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రంలో తాను తెలుగింటి అమ్మాయిలా కనిపించానని, చిత్రాన్ని వీక్షించి సక్సెస్ చేసిన ప్రేక్షకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



'ఆయ్' హీరో హీరోయిన్‌లు నితిన్, నయన్‌సారిక

దోమల నివారణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్

పటమట(విజయవాడతూర్పు): దోమల నివారణకు వీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. నగరంలో దోమల దాడి ఎక్కువగా ఉందని దీనిపై వీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని మంగళవారం 'దోమలు బాబోయ్.. దోమలు' శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన వీఎంసీ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. నగరంలోని ఆయా ప్రాంతాల్లో మంగళవారం సాయంత్ర ఫాగింగ్ చేశారు. సర్కిల్-3 పరిధిలోని మలేరియా డివిజన్ 4లో సిబ్బంది స్పందించి పటమట పరిధిలోని 10, 11 డివిజన్లలో డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సెక్రటరీ ఆధ్వర్యంలో ఫాగింగ్ చేశారు. ఈ మేరకు వీఎంసీ బయాలజిస్ట్ మాట్లాడుతూ పటమట ప్రాంతంలోని దానయ్య బజారు, జ్యోతివిద్యాలయం వీధులు, రామినేని నగర్, పటమట రైతుబజారు, పీఅండ్‌టీ కాలనీ-3, విజయనగర్ కాలనీ, వివేకానంద కాలనీ, పంటకాల్వరోడ్డు ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేశామన్నారు. ప్రతి సోమవారం కల్వర్ట్ ఫాగింగ్, కల్వర్ ఓవర్ స్ప్రేమ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా డివిజన్లలో మంగళ, గురు, శనివారాల్లో హ్యాండ్ ఫాగింగ్, గురు, శుక్రవారాల్లో ఆటో ఫాగింగ్ చేస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా ప్రధాన కాల్వల్లో కల్వర్టుల్లో దోమల నిర్మూలనకు డ్రోన్‌ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రేచేసి నూతన విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు.



పటమటలో మంగళవారం రాత్రి ఫాగింగ్ చేస్తున్న వీఎంసీ సిబ్బంది

విదేశాల్లో మెడిసిన్ చదివిన వారికి న్యాయం చేయాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విదేశాల్లో మెడిసిన్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు ఒక ఏడాది ఇంటర్న్‌షిప్ తర్వాత మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హెల్త్ యూనివర్సిటీ ఎదుట ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఒక ఏడాది ఇంటర్న్‌షిప్ తర్వాత రిజిస్ట్రేషన్ చేస్తుండగా, మన రాష్ట్రంలో రెండు సంవత్సరాలు చేయాలని చెబుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని చాలా మంది విద్యార్థులు మెడికల్ కౌన్సెలింగ్‌లో సీటు రాక, ప్రైవేటులో ఫీజు కట్టలేక, విదేశాలకు వెళ్లి వైద్య విద్యను పూర్తి చేశారన్నారు. అనంతరం ఎన్ఎంసీ పెట్టిన పరీక్షల్లో ఉత్తీర్ణులై ఇంటర్న్‌షిప్ ఏడాది పూర్తి చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ మరో ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేయాలని చెబుతున్నారని, ఇది ఏ రాష్ట్రంలో లేదన్నారు. వెంటనే ఫారిన్‌లో మెడికల్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ప్రతినిధి ఎం. సాయికుమార్‌తో పాటు, పలువురు విదేశాల్లో మెడిసిన్ చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



హెల్త్ వర్సిటీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మెడికల్ గ్రాడ్యుయేట్స్, ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

నగరంలో ఫుట్‌వేర్ పార్క్ ఏర్పాటుకు కృషి

- జీఎస్టీ పెంపు, బీఐఎస్ నిబంధనలతో నష్టాల ఊబిలో పాదరక్షల పరిశ్రమలు
- ఏపీ ఫుట్‌వేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుక్కపల్లి అరుణ్‌కుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో పాదరక్షల తయారీ, విక్రయ రంగాలను ప్రమోట్ చేసేందుకు విజయవాడలో ఫుట్‌వేర్‌పార్క్ ఏర్పాటుకు కృషి జరుగుతుందని ఏపీ ఫుట్‌వేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుక్కపల్లి అరుణ్‌కుమార్ అన్నారు. దీనిపై ఇప్పటికే ప్రతిపాదనలు కేంద్ర కామర్స్ అండ్ ఇండస్ట్రీ మంత్రికి అందజేసినట్లు పేర్కొన్నారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల దేశ వ్యాప్తంగా పాదరక్షల పరిశ్రమ జీఎస్టీ పెరుగుదల, బీఐఎస్ నిబంధనల విధింపుతో సంక్షోభాన్ని ఎదుర్కొన్నట్లు తెలిపారు. పాదరక్షలపై 5 శాతం ఉన్న పన్నును 12 శాతానికి పెంచడంతో ఈ పరిశ్రమ నష్టాల ఊబిలో చిక్కుకున్నట్లు తెలిపారు. జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. బీఐఎస్ నిబంధనల నుంచి చిన్న, మధ్య తరహా యూనిట్లు ప్రాథమిక దశలో మినహాయించాలని గతేడాది కాలంగా చేసిన పోరాటం ఫలించి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సంఘ కార్యదర్శి వీర్‌ప్రీత్‌సింగ్, అనీల్‌కుమార్ భవానీ, సభ్యులు కోటేశ్వరరావు, శ్రీనివాసబాబు, పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

అసోసియేషన్ 2024-26 సంవత్సరానికి మేనేజింగ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చుక్కపల్లి అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా డి భరత్‌కుమార్, వీర్‌ప్రీత్‌సింగ్, కార్యదర్శిగా అనీల్‌కుమార్‌భవానీ, కోశాధికారిగా హెచ్ చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీలుగా వైవీ రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న చుక్కపల్లి అరుణ్‌కుమార్, వేదికపై ఇతర సభ్యులు

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంగ్లిష్(ఆంగ్లం), వృక్షశాస్త్రం (బోటనీ) సబ్జెక్టులను బో ధించేందుకు గెస్ట్ లెక్చరర్స్‌గా పని చేయుటకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుచున్నట్లు జిల్లా విద్యాధికారి సీఎస్ఎస్ఎన్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టులో కనీసం 50 శాతం తక్కువ కా కుండా ఉత్తీర్ణులైన అభ్యర్థులు సదరు నకలు కాపీలతో నేరుగా ఈ నెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు డీఐఈఓ ఆఫీసు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాయకాపురం నందు హాజరుకావాలని తెలిపారు. గెస్ట్ ఫాకల్టీగా ఎంపికైన వారికి గంటకు రూ.150 చొప్పున, గరిష్టంగా నెలకు రూ.10 వేలకు మించకుండా చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. రిటైర్డు ప్రొఫెసర్స్, లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.

పటమటలో గొలుసుదొంగతనం

పటమట(విజయవాడతూర్పు): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో గొలుసును గుర్తు తెలియని దుండగులు దొంగతనం చేసిన ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట గురునానాక్ కాలనీ ఫన్‌టైం క్లబ్ రోడ్డు మణికంఠ అపార్టుమెంటులో కొల్లిపర ఉషాకిరణ్ నివసిస్తుంటారు. ఈ నెల 17 తేదీన తన ఇంటి నుంచి గురునానక్‌కాలనీలో ఉన్న ఉషోదయ సూపర్‌మార్కెట్‌లో సరుకులు కొనుగోలుకు నడుచుకుంటూ వెళ్తుండగా అక్కడ ఉన్న ఓ హోటల్ పక్క వీధి నుంచి గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చాడు. ఆమెను చంపేస్తానని, మెడలో ఉన్న గొలుసును ఇవ్వాలని బెదిరించాడు. తన మెడలో ఉన్న 20 గ్రాముల గొలుసును బలవంతంగా లాక్కుని బండిపై అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలు ఫిర్యాదుతో మంగళవారం పటమట పోలీసులు కేసును నమోదు చేశారు.

రేపు సంకటహర చతుర్థి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మారుతీ వ్యాయామశాల సమీపంలోని గణపతి బాబా మందిరంలో గురువారం సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొమందూరి రఘురామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామికి పంచామృత అభిషేకం, అనంతరం సహస్రనామార్చన పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆస్పత్రికి వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి తిరిగిరాకపోవడంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై మంగళవారం కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. రాణిగారితోటకు చెందిన గుడివాడ రామమోహన్‌రావు(54) అదే ప్రాంతంలో కిరాణా షాపు నిర్వహిస్తుంటాడు. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో అతను ఆస్పత్రికి వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులను, పలు ప్రాంతాల్లో వెదికినా అతని ఆచూకీ లభించలేదు. ఇంటికి తిరిగి వస్తారని ఎదురు చూసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గగుడి చైర్మన్ కర్నాటిపై దాడి చేసిన వ్యక్తికి జైలు

విజయవాడస్పోర్ట్స్: దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబుపై దాడి చేసిన గుంజా కృష్ణకు తొమ్మిది నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ 7వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నాగేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలోని శ్మశానవాటికలో తన తండ్రి సమాధి వద్ద దీపం వెలిగించి వస్తున్న రాంబాబును అక్కడే పని చేసే ఇద్దరు వ్యక్తులు డబ్బులు అడిగారు. వారిద్దరికీ రూ.100 చొప్పున ఇచ్చిన అనంతరం మూడో వ్యక్తి(నిందితుడు గుంజా కృష్ణ) వచ్చి డబ్బులు అడిగాడు. చిల్లర లేదని చెప్పి వస్తున్న రాంబాబుపై గుంజా కృష్ణ గాజు సీసాను పగలగొట్టి దాడి చేశాడు. దాడిలో రాంబాబు పొట్ట ఎడమ భాగంలో గాయమైంది. 2023 నవంబర్ 24వ తేదీన జరిగిన ఘటనపై బాధితుడి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడుని కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.జేమ్స్ కోర్టుకు వాదనలు వినిపించారు. తొమ్మిది మంది సాక్షులను విచారణ చేసిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు కృష్ణకు న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారు.

ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సీపీఎం కార్పొరేటర్ బోయ సత్తిబాబు కోరారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఏపీసీపీడీసీఎల్ టౌన్ డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం సూర్యారావుపేటలోని ఎస్ఈ కార్యాలయంలో ప్రత్యేక అదాలత్ జరిగింది. నగరానికి చెందిన ముగ్గురు విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై అదాలత్‌లో సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ రిటైర్డ్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్‌కు ఫిర్యాదు చేశారు. వీరితో పాటు సీపీఎం పలు సమస్యలపై అదాలత్‌లో ఫిర్యాదు చేసింది. అదనపు లోడ్ కోసం రుసుం చెల్లించామని, రెగ్యులరైజ్ చేయలేదని, వెంటనే లోడ్ అప్ డేట్ చేయాలని ఓ వినియోగదారుడు, సోలార్ మీటర్ స్ట్రక్ అయ్యిందని, యావరేజ్ యూనిట్లు కలుపలేదని మరో వినియోగదారుడు, స్తంభాలు ఏర్పాటు చేయాలని కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏపీసీపీడీసీఎల్ అధికారులు స్పందించి వారి సమస్యలను పరిష్కరించారు. ట్రూ అప్ కరెంట్ చార్జీలు రద్దు చేయాలని, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల రద్దుచేయాలి, ఓవర్ లోడ్ చార్జీ వసూలు నిలిపివేయాలి, కరెంట్ కోతలు ఆపాలి, లోఓల్టేజీ, హైఓల్టేజ్ వలన నష్టపోయిన వినియోదారులకు పరిహారం చెల్లించాలని, ట్రాన్స్‌ఫార్మర్స్ కెపాసిటీ పెంచాలని సీపీఎం కార్పొరేటర్ బోయ సత్తిబాబు కోరారు. ప్రత్యేక అదాలత్‌లో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానుయేల్, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సునీత, టౌన్ డివిజన్ ఈఈ బీవీ సుధాకర్, టెక్నికల్ ఈఈ హనుమయ్య, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



ప్రత్యేక అదాలత్‌లో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ బోయ సత్తిబాబు

దోమల నివారణపై అవగాహన ర్యాలీ

పాయకాపురం(విజయవాడరూరల్): దోమల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరుతూ పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్ విద్యార్థులు, వైద్యసిబ్బందితో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు 'దోమలను నివారిద్దాం-ఆరోగ్యాన్ని కాపాడుకుందాం' అనే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.రాజా మాట్లాడుతూ దోమల వలన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఇళ్ల ముందు మురుగునీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డ్రెయినేజీలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు

అందరినీ ఆకట్టుకునేవిధంగా 'సీతారాం సిత్రాలు'

లబ్బీపేట(విజయవాడతూర్పు): పాత రోజులను గుర్తు చేస్తూ పెళ్లి, వీసీఆర్ క్యాసెట్‌పై అల్లిన ఒక అందమైన ప్రేమకథాచిత్రమే సీతారాం సిత్రాలు అని ఆ చిత్ర హీరో లక్ష్మణ్ అన్నారు. ఈ నెల 30న విడుదల కానున్న ఆ సినిమా అందరినీ ఆకట్టుకుంటుందన్నారు. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో లక్ష్మణ్ మాట్లాడుతూ తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సమయంలో చిత్ర దర్శకుడు నాగ శశిధర్‌రెడ్డి చెప్పిన కథ విని హీరోగా నటించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. కేవలం రూ.కోటిన్నరతో సినిమా పూర్తి చేశామని, నలుగురు నిర్మాతలు ఈ చిత్రాన్ని అందమైన ప్రేమ కావ్యంగా మలిచారన్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రమోషన్ కార్యక్రమం వేగవంతంగా చేశామని, వెళ్లిన ప్రతి కాలేజీలో యువత తమను ఎంతగానో ఆదరిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్శకుడు నాగశశిధర్‌రెడ్డి మాట్లాడుతూ సినిమాల్లో కంటెంట్ ఉంటే ప్రేక్షకులు చిన్న చిత్రమైన పెద్ద చిత్రమైన తప్పక ఆదరిస్తారనే నమ్మకంతో సీతారాం సిత్రాలు ప్రేమకథ తీసినట్లు తెలిపారు. ఈ సినిమాలో యూట్యూబ్ ద్వారా అందరికీ చిరపరిచితమైన భ్రమరాంబిక నటించినట్లు చెప్పారు. సమావేశంలో సహ నిర్మాత పవన్‌రాజు, యూనిట్ సభ్యులు మహమ్మద్ సలీం, ఇర్ఫాన్, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని ఓ హోటల్లో సీతారాం సిత్రాలు చిత్ర హీరో లక్ష్మణ్, దర్శకుడు నాగ శశిధర్‌రెడ్డి, ఇతర సభ్యులు

కళాకారులకు సాంస్కృతిక స్పృహ ఉండాలి

విజయవాడ కల్చరల్: కళాకారులకు సాంస్కృతిక స్పృహ ఉండాలని న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. ఏపీ అమరావతి సాంస్కృతిక క్రీడలు సేవా సమితి ఆధ్వర్యంలో కౌతా పూర్ణానందం కళావేదిక మీద నాలుగు రోజులపాటు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు మంగళవారం కొనసాగాయి. ఈ కార్యక్రమంలో సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు, సినీ సంగీత విభావరి, కళాకారులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ నటుడు చిరంజీవి స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నట్లు తెలిపారు. చిరంజీవి చారిటబుల్ సంస్థ ద్వారా బ్లడ్ బ్యాంక్ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు పీ వెంకన్న సంస్థ లక్ష్యాలను వివరించారు. గాయనీ,గాయకులు చిరంజీవి నటించిన చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు వారికి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో నారాయణ, ప్రభల శ్రీనివాస్, ఏబీ ఆనంద్, సూర్యదేవర జగన్నాథరావు విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్ రాజు పాల్గొన్నారు.

కళావేదికపై శిగపట్లు

కౌతా పూర్ణానందం కళావేదికపై సోమవారం జరిగిన కార్యక్రమంలో ఇద్దరు మహిళలు వ్యక్తి గత కారణాలతో దాడులు చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు వారిని స్టేషన్‌కు పిలిపించి మందలించినట్లు సమాచారం.



గాయకులకు జ్ఞాపికలను అందజేస్తున్న గుప్తా, సూర్యదేవర జగన్నాథరావు

వైద్య విద్యార్థిని కుటుంబానికి సత్వర న్యాయం చేయాలి

ఆయుర్వేద వైద్యుల ర్యాలీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కోల్‌కతా మెడికల్ కాలేజీలో అత్యాచారం, హత్యకు గురైన వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని విశ్వ ఆయుర్వేద పరిషద్ డిమాండ్ చేసింది. విశ్వ ఆయుర్వేద పరిషత్ విజయవాడ విభాగం జనరల్ సెక్రటరీ డాక్టర్ నల్లు ధరణికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ జరిగింది. ప్రెస్‌క్లబ్, అలంకార్ సెంటర్, లెనిన్ సెంటర్, ఏలూరు రోడ్డు, మ్యూజియం రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయుర్వేద వైద్యులు, విద్యార్థులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. వైద్యులకు రక్షణ కల్పించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నిధిమీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధరణి కుమార్ మాట్లాడుతూ ఘటనపై సత్వర విచారణ జరిపాలని, నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యశాలలో సెక్యూరిటీ, తగినన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సాహితీ మాట్లాడుతూ స్త్రీలు ఇప్పటి సమాజంలో ఎంతో సాధిస్తున్నప్పటికీ కీచకుల చేతుల్లో బలికావడం శోచనీయమన్నారు. స్త్రీలకు రక్షణ కల్పించే బలమైన చట్టాలని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ గురుమూర్తి, డాక్టర్ భాను ప్రకాష్, డాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యులు, విద్యార్థులు